
# సాక్షి ఒడిశా

శుక్రవారం । 7 । ఏప్రిల్ । 2023



**శ్రీమందిరం ఆదాయం లెక్కింపు**

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,79,243లు, బంగారం 800 మిల్లీగ్రాములు, వెండి 5.5 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



**ఉసూరుమనిపించని వరుణుడు**

- 8లో.



**ఖుర్దారోడ్‌లో బాలాజీ బ్రహ్మోత్సవాలు**

- 8లో.

## న్యూస్‌రీల్

### దేవమాలి సందర్శించిన కలెక్టర్



దేవమాలి పర్వతంపై కలెక్టర్ మహ్మద్ అక్తర్

కొరాపుట్: దేవమాలి గిరిశిఖరాన్ని జిల్లా కలెక్టర్ అబ్దుల్ మహ్మద్ అక్తర్ సందర్శించారు. జిల్లాలోని పొట్టంగి సమితిలో అత్యంత ఎత్తయిన పర్యాటక ప్రాంతం దేవమాలి పర్వతం పైకి గురువారం వెళ్లారు. ఇక్కడ రాష్ట్రప్రభుత్వం ఎకో టూరిజం పథకాన్ని అమలు చేస్తోంది. అంతర్జాతీయ స్థాయిలో అటవీశాఖ ద్వారా కాటేజీలు నిర్మిస్తోంది. వీటి నిర్మాణ తీరును ఆయన పరిశీలించారు. పరిశీలనలో అటవీ, రెవెన్యూ, పర్యాటక శాఖ అధికారులు ఉన్నారు.

### కాలియా అర్హులు 1,17,731మంది



కాలియా సమావేశంలో కలెక్టర్, అధికారులు

జయపురం: కొరాపుట్ జిల్లాలోని 14సమితులలో కాలియా పథకానికి సంబంధించి 1,17,731 మంది రైతులు అర్హులుగా గుర్తించామని జిల్లా వ్యవసాయశాఖ అధికారి బిష్ణురాజ్ రథ్ వెల్లడించారు. దీనికి సంబంధించి లబ్ధిదారుల ఖాతాలో రూ.2 వేల చొప్పున నగదు జమ చేశామని తెలిపారు. ఈ సందర్భంగా జయపురంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అబ్దుల్ మహ్మద్ అక్తార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్రప్రభుత్వం రైతుల సంక్షేమానికి, సహాయం అందించేందుకు ఈ పథకాన్ని అమలు చేస్తోందని, దీనిని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

### జిల్లా కళాకారులకు సత్కారం



కళాకారులను సత్కరిస్తున్న మాజీమంత్రి ప్రఫుల్ల శామల్

పర్లాకిమిడి: ఉత్కళ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో భాగంగా పర్లాకిమిడికి చెందిన లోక నృత్య కళాకారులు, గుమ్మకు చెందిన లంజియా సబర కళాకారులు తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. వందేమాతరం, ఆదివాసీ నృత్యాలతో రాష్ట్ర సాంస్కృతిక శాఖ మాజీమంత్రి ప్రఫుల్ల శామల్ మన్ననలు పొందారు. వేదికపై రాష్ట్ర పర్యాటకాభివృద్ధి నిగమ్ అధికారి లెనిన్ మహంతి, భువనేశ్వర్ ఎమ్మెల్యే రంజన్ కుమార్ దాస్ పాల్గొని కళాకారులను ప్రశంసా పత్రాలతో సత్కరించారు. కార్యక్రమానికి జిల్లా సాంస్కృతిక శాఖ అధికారి అర్చనా మంగరాజ్, ఇతర అధికారులు హాజరయ్యారు.

### కలహండిలో ప్రవేశాలకు ఎన్‌ఎంసీ ఆమోదం

- ఏటా 100 వైద్య సీట్ల భర్తీకి మార్గంసుగమం

భువనేశ్వర్: కలహండి జిల్లా భవానీపట్నలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ వైద్య కళాశాల(జీఎంసీ)కి జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) ఆమోదం తెలిపింది. రాష్ట్ర ప్రజల చిరకాల ఆకాంక్షలను ఈ సంస్థ నెరవేరుస్తుందని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కార్యదర్శి షాలినీ పండిట్ తెలిపారు. ఈ ఆమోదం పొందిన తర్వాత 2023–24 విద్యా సంవత్సరం నుంచి ఎంబీబీఎస్‌లో 100మంది ఇన్‌టేక్ సామర్థ్యం కలిగి ఉంటుందని ప్రకటించారు. వైద్య విద్య, వృత్తి నియంత్రణ సంస్థ ఎన్ఎంసీ 2023–24 అకడమిక్ సెషన్ నుంచి 100 సీట్ల భర్తీకి ఆమోదించడంతో మొదటి బ్యాచ్ విద్యార్థులను చేర్చుకోవడానికి కలహండి వైద్య కళాశాల సిద్ధంగా ఉంది. భవానీపట్నలోని భంగాబరిలో కలహండి ప్రభుత్వ వైద్య కళాశాల, ఆస్పత్రి(ఎంసీహెచ్) రూ.200 కోట్ల పెట్టుబడితో నిర్మించబడింది. వైద్య కళాశాల, ఆస్పత్రి సుందరీకరణ పనులు దాదాపుగా పూర్తయినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. 100సీట్ల వైద్య కళాశాలకు సంబంధించి అకడమిక్, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, హాస్టళ్లు, స్టాఫ్ క్వార్టర్ల ఏర్పాటు పనులు దాదాపు పూర్తి కాగా.. బోధనాస్పత్రి భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. వీటిని 2024–25 విద్యాసంవత్సరం నాటికి పూర్తి చేయాలని భావిస్తున్నారు.

# ఒకే తాటిపైకి!

- రాయగడలో ఉత్సవాల నిర్వాహనపై తలెత్తిన వివాదం
- ఈనెల 14న అంబేడ్కర్ జయంతి, పానా సంక్రాంతి
- వేడుకలకు గోవింద్ర చంద్రదేవ్ పాఠశాల మైదానంలో ఇరువర్గాల ఏర్పాట్లు
- అధికారుల చొరవతో సద్దుమణిగిన గందరగోళం



చర్చల్లో పాల్గొన్న ఏడీఎంలు ప్రధాన్, బెహరా, ఐఐసీ కుహారో, మాఝి

రాయగడ: జిల్లా కేంద్రంలో ఈనెల 14న జరగనున్న ఒడియా ప్రజల నూతన సంవత్సరం పానా సంక్రాంతి వేడుకలకు సంబంధించి రేగిన వివాదం ఎట్టకేలకు కొలిక్కి వచ్చింది. రాయగడలోని గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో వేదికపై వేడుకలు నిర్వహించేందుకు ఇరువర్గాలు మొండిపట్టు పట్టగా.. అధికారుల చొరవతో వేర్వేరు సమయాల్లో జరుపుకొనేందుకు కమిటీలు అంగీకరించాయి. వివరాల్లోకి వెళ్తే.. 14న జరగనున్న పానా సంక్రాతి వేడుకలను గోవింద చంద్రదేవ్ పాఠశాల మైదానంలో నిర్వహించుకునేందుకు జిల్లా యంత్రాంగం అనుమతిచ్చింది. అయితే అదే మైదానంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి నిర్వహించుకునేందుకు దళిత వర్గాల నాయకులు(నిర్వాహకులకు) అభ్యంతరం చెప్పడంతో వివాదం తారాస్థాయికి చేరుకుంది. ఒకవైపు పానా నిర్వాహకులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. దీనికి సంబంధించి మూహూర్తపు రాట పూజలు కూడా అట్టహాసంగా నిర్వహించారు. అయితే ఒకేరోజు కార్యక్రమాలు కావడం, మైదానం కోసం అధికారులు స్పష్టత ఇవ్వకపోవడంతో దళిత వర్గాల నాయకులు అసంతృప్తి వ్యక్తంచేశారు. అనుమతి ఇవ్వాల్సిందే అని పట్టుబట్టారు.

**ఒకేసారి దరఖాస్తు..**

ఒకవైపు పానా సంక్రాంతి, అదేవిధంగా అంబేడ్కర్ జయంతి సమీపిస్తున్న నేపథ్యంలో రెండు వర్గాల నాయకులతో జిల్లా యంత్రాంగం గురువారం సమావేశం నిర్వహించారు. దళిత వర్గాలకు చెందిన గంగాధర్ పువ్వల, తపన్ పెద్దింటి, హరప్రసాద్ హెప్రుక, కర్తన్న తదితరులు హాజరవ్వగా.. పానా నిర్వాహకుల్లో నిరంజన్ భక్షి పాత్రో, దేవాశీస్ ఖడంగ, బసంతకుమార్ ఉలక పాల్గొన్నారు. జిల్లా యంత్రాంగం తరుపున అదనపు మేజిస్ట్రేట్‌లు సోమనాథ ప్రధాన్, ధర్మానంద బెహరా, రాయగడ సదరు థానా అధికారి(ఐఐసీ) కమలాకాంత్ కుహారో, డీఎస్పీ ఉల్లాస్ మాఝి పాల్గొన్నారు. ఇరువర్గాలకు చెందిన నాయకులతో చర్చించిన అధికారులు.. సమస్యను పరిష్కరించడంలో విఫలమయ్యారు. అయితే జిల్లా యంత్రాంగం ముందుగా పానా సంక్రాంతి వేడుకలను నిర్వహించేందుకు అనుమతిచ్చిందని, ఈ క్రమంలో ఉత్సవాలను గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో జరుపుకోవచ్చని అధికారులు తెలిపారు. దీనిపై దళిత వర్గాల నాయకులు అభ్యంతరం వ్యక్తంచేశారు. ఒకేరోజు ఇరువర్గాల నుంచి మైదానం కోసం దరఖాస్తు చేయగా.. ఒకరికే ఎలా అనుమతిచ్చారని గంగాధర్ పువ్వల నిలదీశారు. ఇది అంబేడ్కర్‌ను అవమానించినట్టే పేర్కొన్నారు. దీంతో జిల్లా యంత్రాంగానికి ఇదో తలనొప్పిగా మారింది.



హాజరైన ఇరువర్గాల ప్రతినిధులు, నాయకులు

## ఎట్టకేలకు అంగీకారం..

బుధవారం ఉదయం జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో ఇరువర్గాల ప్రతినిధులతో జరిగిన చర్చలు బెడిసికొట్టాయి. దీంతో ఏడీఎం సోమనాథ్ ప్రధాన్ ఆధ్వర్యంలో సాయంత్రం మరోసారి సమావేశం నిర్వహించారు. దీంతో ఇరువర్గాలు అంగీకారానికి వచ్చారు. ఈనెల 14న ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో అంబేడ్కర్ జయంతి, అదే వేదికపై సాయంత్రం 4గంటల నుంచి పానా సంక్రాంతి నిర్వహించేందుకు అంగీకరించారు. దీంతో సమస్య కొలిక్కివచ్చింది. అంబేడ్కర్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గంగాధర పువ్వల, హరప్రసాద్ హెప్రుక, పానా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నిరంజన్ బక్షిపాత్రో, బసంత ఉలక, దేవాశీష్ ఖడంగ తదితరులు పాల్గొన్నారు.



ఏడీఎం ప్రధాన్‌తో చర్చిస్తున్న ప్రతినిధులు

# తప్పిన తిప్పలు



బస్సు వద్ద ఎంపీ, ఎమ్మెల్యేలు, నాయకులు

- స్వాభిమాన్ ఏరియాలో ఆర్టీసీ బస్సు ప్రారంభం

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి స్వాభిమాన్ ఏరియా జంత్రి, పనాస్‌పుట్, అంద్రాహల్, గాజులమమ్ముడి పంచాయతీలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో స్థానికులు నాటు పడవలు, లాంచీల పైనే ఆధారపడే వారు. ఈ నేపథ్యంలో ఆయా గ్రామాలకు బస్సు సర్వీసును ఎంపీ రమేష్ మాఝి జోడాంబ్ వద్ద గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఈ ప్రాంతంలో పర్యటించిన సమయంలో ప్రయాణ సౌకర్యాలు కల్పించాలని స్థానిక గిరిజనులు కోరారని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో చిత్రకొండ–జంత్రి మార్గంలో 40కిలోమీటర్ల రోజూ ప్రయాణించే ఒడిశా ఆర్టీసీ సర్వీసును మంజూరు చేశామని తెలిపారు. స్వాభిమాన్ ఏరియా ఒకప్పుడు మావోయిస్టులకు కంచుకోటగా ఉండేదని, గురుప్రియ వంతెన నిర్మాణం తరువాత కొన్ని పంచాయతీలకు బస్సులు వేశామన్నారు. ప్రస్తుతం మరిన్ని ప్రాంతాలకు విస్తరించడంతో ఈ ప్రాంతవాసుల ప్రయాణ కష్టాలు తీరుతాయని ఆశాభావం వ్యక్తంచేశారు. ఇకపై జలాశయంలో గిరిజనులకు పడవ ప్రయణాలు, ప్రమాదాలు తప్పినట్లే అని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చిత్రకొండ ఎమ్మెల్యే పూర్ణచంద్ర బక్క, మల్కన్‌గిరి మాజీ ఎమ్మెల్యే మానస్ మడకామి, సమితి అధ్యక్షురాలు రాజేశ్వరి ఖీలో, బీజేడీ నాయకులు పాల్గొన్నారు.



సర్వీసును ప్రారంభిస్తున్న ఎంపీ రమేష్ మాఝి

## గోశాలకు రూ.17 లక్షల సాయం



మంజూరు పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహినీపతి

- నిర్వాహకులకు మంజూరు పత్రాన్ని అందించిన ఎమ్మెల్యే తారాప్రసాద్

జయపురం: పట్టణానికి సమీపంలోని పల్లిగుడ గ్రామంలో నిర్వహిస్తున్న గోశాలలో ఆవుల పరిరక్షణ, వైద్యం నిమిత్తం కొరాపుట్ ప్రధాన పశు చికిత్స విభాగం నిధి నుంచి రూ.17,17,333ల ఆర్థికసాయం అందించారు. దీనికి సంబంధించి మంజూరు పత్రాన్ని పల్లిగుడలో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహినీపతి.. గోశాల నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోపాలన ఎంతో పవిత్రమైనదన్నారు. వారి సంరక్షణకు పల్లిగుడలో కేంద్రం ఏర్పాటు చేయడంపై ప్రశంసించారు. నిర్వహణ, ఆహారం, చికిత్స కోసం అందించిన నిధిని సద్వినియోగం చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పశువైద్య ప్రధాన అధికారి బిచిత్రా దాస్, జయపురం పశు వైద్యాధికారి అలోక్ ఆచార్య, సానాల్ మహాపాత్రో, సమితి బీఓ రాజీవ్ దాస్, గోశాల అధ్యక్షుడు ప్రకాశ నాయక్, గోశాల సమితి ప్రెసిడెంట్ రామనాథ్ సాహు, ఉపాధ్యక్షుడు బీజీ రావు, కోశాధ్యక్షుడు శ్రీనివాస్ అగర్వాల్, రవ్వా రామకృష్ణ, సహాయ కార్యదర్శి కాలూరాం పండా, చాంబర్ అధ్యక్షుడు రాజ్‌పాల్ ఖురాణ, రామహరి పండా, టునా సాహు, రాజు అగర్వాల్, రజినీకాంత నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోపాల గోసేవా సమితి అధ్యక్షుడు సాహు మాట్లాడుతూ 2014లో కేంద్రాన్ని నెలకొల్పామని, కుందారిగుడలో ప్రభుత్వ స్థలంలో సభ్యులు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో నిర్మించామని తెలిపారు. అనంతరం 1.9 ఎకరాల్లో పల్లిగుడ గ్రామంలో గోశాల ఏర్పాటు చేశామని, రెండు కేంద్రాల్లో 170 ఆవులు ఉన్నాయని వివరించారు.



ఆవులకు దానా తినిపిస్తున్న ఎమ్మెల్యే

## 'మైనారిటీ ధ్రువపత్రం అమలు చేయండి'



రాష్ట్ర మైనారిటీ సలహాదారు తహిరా ఖటున్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

- రాష్ట్ర మైనారిటీ సలహాదారు తహిరీ ఖటున్‌కు వినతి

కొరాపుట్: పక్క రాష్ట్రాల తరహాలో ఒడిశాలో కూడా తమకు మైనారిటీ ధ్రువపత్రం అమలు చేయాలనీ మైనారిటీ సంఘాల ప్రతినిధులు కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని స్పెషల్ సర్క్యూట్ హౌస్‌లో రాష్ట్ర మైనారిటీ సలహాదారు తహిరా ఖటున్‌ను గురువారం కలిసి, వినతిపత్రం అందజేశారు. ఇతర రాష్ట్రాలలో మైనారిటీలకు ప్రభుత్వాలు ధ్రువపత్రాలు అందజేస్తున్నాయని గుర్తుచేశారు. ప్రభుత్వ పథకాలు, విద్య, వైద్య, వ్యవసాయ, సంక్షేమ రంగాలలో ఈ పత్రం ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. తహిరా రాక సందర్భంగా సాంఘిక సంక్షేమశాఖ అధికారులు మైనారిటీ వర్గాలకు సమాచారం ఇచ్చారు. తమ సమస్యలు ఆమెకు విన్నవించాలని సూచించారు. దీంతో జయపురం పట్టణానికి చెందిన క్రైస్తవ, మస్లిం, సున్నీ, షియా, గురుద్వారాల నుంచి ప్రతినిధులు కొరాపుట్ తరలివచ్చారు. వినతిని ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లానని ఈ సందర్భంగా ఆమె హామీఇచ్చారు. కార్యక్రమంలో కొరాపుట్ జిల్లా మైనారిటీ కమిటీ చైర్మన్ ఎస్.హసన్ మదనీ, గురుద్వారా కమిటీకి చెందిన సోనిసింగ్ తదితరులు ఉన్నారు.

### రేషన్‌లో అవకతవకలపై ఫిర్యాదు



ఆందోళన చేస్తున్న బీజేపీ ప్రతినిధులు

బరంపురం: ప్రతి రేషన్ లబ్ధిదారుకు 35కిలోల చొప్పున బియ్యం ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మనోజ్ సామంతరాయ్ కోరారు. ఈ మేరకు బరంపురం ఉప జిల్లా పాలనాయంత్రాంగ కార్యాలయం ఎదుట గురువారం ఆందోళనకు దిగారు. జిల్లాలోని చికిటి నియోజకవర్గ పరిధిలో లబ్ధిదారులకు ప్రభుత్వం కల్పించిన 35కిలోల బియ్యం కాకుండా 5కిలోల బియ్యం మాత్రమే ఇస్తున్నారని ఆరోపించారు. దీనిపై చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ ఆశిష్ కులకర్ణికి వినతిపత్రం అందించారు. ఆందోళనలో బీజేపీ యువమోర్చా నాయకులు పాల్గొన్నారు.

## బీజేడీ అభ్యర్థులను గెలిపించాలి



బ్లాక్ కార్యాలయం ఆవరణలో తిరుపతి పాణిగ్రాహి, నాయకులు

పర్లాకిమిడి: జిల్లాలోని కాశీనగర్, గుసాని, గుమ్మా సమితుల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించిన తరహాలో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించేందుకు అంతా కృషి చేయాలని బీజేడీ జిల్లా అధ్యక్షులు జగబంధు దాస్ కోరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడుగా ఎన్నికైన ఆయన.. పర్లాకిమిడి నియోజకవర్గంలోని కాశీనగర్, గుసాని సమితులలో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ గవర తిరుపతిరావు, సమితి అధ్యక్షురాలు బల్ల శాయమ్మ, జెడ్పీటీసీ, సర్పంచులు, సమితి సభ్యులు ఆయనకు పుష్పగుచ్ఛం అందించి, ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో బీజేడీ సీనియర్ నాయకులు తిరుపతి పాణిగ్రాహి, గుసాని సమితి అధ్యక్షుడు ఎస్.వీర్రాజు, జెడ్పీటీసీ ఎస్.బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



జగబంధు దాస్‌ను ఆహ్వానిస్తున్న జెడ్పీ చైర్మన్ తిరుపతిరావు, సమితి అధ్యక్షురాలు శాయమ్మ

# రహదారిపై ఘోరం



మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

- మంటల్లో చిక్కుకొని ముగ్గురు డ్రైవర్లు సజీవదహనం
- కటక్ జిల్లాలో మరొకరు మృతి

భువనేశ్వర్: ఝార్సుగుడ, కటక్ జిల్లాల్లో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు వ్యక్తులు మృతిచెందారు. మరో ఐదుగురు గాయపడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దీనికి సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఝార్సుగుడ సదర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బొగ్గు రవాణా చేస్తున్న రెండు ట్రక్కులు వెనుక నుంచి ఒకదానికి ఒకటి ఢీకొట్టడంతో పాటు ఎదురుగా వచ్చిన ట్రాలర్ ముఖాముఖి ఢీకొని మంటలు చెలరేగాయి. వీటిని నడుపుతున్న ముగ్గురు డ్రైవర్లు వాహనాల్లో ఇరుక్కుపోయి సజీవ దహనమయ్యారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. బుధవారం అర్ధరాత్రి ఘటన జరగ్గా.. చుట్టుపక్కల వారు సమాచారం అందించడంతో 3 యూనిట్ల అగ్నిమాపక దళం రంగంలోకి దిగి, మంటలను నివారించింది. స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరి సహాయక చర్యలు పర్యవేక్షించారు. సత్వర చికిత్స కోసం క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. వీరి వివరాలు తెలియాల్సి ఉంది. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. ఈ ప్రమాదంతో 49వ నంబర్ జాతీయ రహదారిలో ఇరువైపులా పెద్ద సంఖ్యలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో గురువారం ఉదయం వరకు వాహనదారులు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు.



ఘటనా స్థలంలో పరస్పరం ఢీకొని ఉన్న ట్రక్కులు



ట్రక్కు దూసుకు పోవడంతో నుజ్జయిన కారు

**దూసుకెళ్లిన ట్రక్కు..**

కటక్ జిల్లా బిడానాసి మషాని ఛక్ సమీపంలో కారుపై ట్రక్కు దూసుకెళ్లడంతో రోడ్డు ప్రమాదం సంభవించింది. బుధవారం అర్ధరాత్రి జరిగిన ఈ దుర్ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఒకరు మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుడు, గాయపడిన ముగ్గురూ ఢెంకనాల్ జిల్లాకు చెందినవారు. కారులో కటక్‌కు వెళ్తుండగా ట్రక్కు దూసుకుపోవడం ప్రమాదం జరిగింది. సమాచారం అందడంతో బిడానాసి ఠాణా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. అలాగే మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పంపించగా, క్షతగాత్రులను కటక్ ఎస్‌సీబీ మెడికల్ కళాశాల ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఆస్పత్రి వర్గాల సమాచారం.

## క్లుప్తంగా

### చెట్టును ఢీకొట్టిన వ్యాన్

• డ్రైవర్, క్లీనర్‌కు తీవ్ర గాయాలు



ప్రమాదంలో నుజ్జయిన వ్యాన్ ముందు భాగం

**కురుపాం:** మండలంలోని గుమ్మ గ్రామ సమీపంలో పార్వతీపురం నుంచి గుమ్మలక్ష్మీపురం వైపు వెళ్తున్న కోళ్ల వ్యాన్ చెట్టును గురువారం బలంగా ఢీకొట్టింది. దీంతో వ్యాన్ ముందు భాగం నుజ్జయింది. డ్రైవర్, క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108కి సమాచారం ఇవ్వగా క్షతగాత్రులను కురుపాం ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ సీహెచ్ ప్రసాద్ తెలిపారు.

### దరఖాస్తుల ఆహ్వానం

**విజయనగరం ఫోర్ట్:** ఎన్‌హెచ్‌ఎంకు సంబంధించిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వారి పరిధిలో ఉన్న ఎస్‌ఎన్‌సీయూలో సెక్యూరిటీ గార్డు ఒకపోస్టు( రోస్టర్ ఎస్టీ, మగ), డెంటల్ టెక్నీషియన్ 2 పోస్టులు, ఐడీఎస్‌పీ పథకంలో ఎపిడిమాలజిస్టు పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.వి.రమణకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలకు విజయనగరం. ఏపీ.జీఓవి.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. సెక్యూరిటీ గార్డు పోస్టుకు 11వతేదీలోగా, డెంటల్ టెక్నీషియన్, ఎపిడిమాలజిస్టు పోస్టులకు 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

### రైలు ఢీకొని వ్యక్తి మృతి

**దత్తిరాజేరు:** మండలంలోని షికారుగంజి రైల్వే గేట్ సమీపంలో గురువారం ఉదయం గూడ్స్ రైలు ఢీకొని పాచలవలస గ్రామానికి చెందిన మరడానం రమేష్(45) మృతి చెందినట్లు బొబ్బిలి రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఈశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. మృతుడు రెండు రోజులు క్రితం కూలి పనికి వెళ్తానని ఇంటి వద్ద చెప్పి తిరుగు ప్రయాణంలో వస్తుండడంతో ఢీకొని మృతి చెందినట్లు తెలిపారు. కోమటిపల్లి రైల్వే మాస్టర్ సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకొని శవపంచనామా అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహన్ని అప్పగించినట్లు తెలిపారు.

### బస్సు ఢీకొని వృద్ధురాలి మృతి



సంఘటనా స్థలంలో సీతమ్మ మృతదేహం

**బొబ్బిలి:** మండలంలోని కమ్మవలస వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొని కండి సీతమ్మ(70)అనే వృద్ధురాలు గురువారం మృతి చెందింది. ఎస్‌ఐ చదలవాడ సత్యనారాయణ తెలిపిన వివరాలు.. సీతమ్మ తన దగ్గరి బంధువును పరామర్శించేందుకు బొబ్బిలి వచ్చింది. తిరిగి కమ్మవలస వెళ్లేందుకు నారాయణపురం బస్సు ఎక్కింది. గ్రామం వద్ద బస్సు దిగిన వృద్ధురాలు సీతమ్మ బస్సు ముందు భాగం నుంచి వంగి నడుచుకుంటూ వెళ్లడాన్ని డ్రైవర్ గమనించకుండా బస్సును తోలడంతో ఆమె చక్రాల కింద పడి తీవ్ర గాయాల పాలైంది. ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతి చెందిన సీతమ్మకు భర్త ఇప్పటికే మృతి చెందగా ముగ్గురు సంతానం ఉన్నారు. ఎస్‌ఐ సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శంకరరావు

**పార్వతీపురం:** విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా నిప్పులు రాలి గాయాలైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు.. మక్కువ మండలం చిముగు గ్రామానికి చెందిన కె.శంకరరావు విద్యుత్ కనెక్షన్ ఇస్తున్న సమయంలో షార్ట్ సర్క్యూట్ జరగడంతో విద్యుత్ తీగల నుంచి నిప్పులు రాలడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ మేరకు స్థానికులు ప్రథమ చికిత్సకోసం మక్కువ పీహెచ్‌సీకి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

### 10న బీఈడీ మిగులు సీట్ల భర్తీ

**ఏయూక్యాంపస్:** ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో బీఈడీ, బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సుల్లో మిగులు సీట్ల భర్తీకి ఈనెల 10న కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ఏయూ ప్రవేశాల సంచాలకులు ఆచార్య డి.ఎ.నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏయూ ఆర్ట్స్ కళాశాల, ఐఏఎస్‌ఈలో కొన్ని సీట్లు మిగిలాయని, వీటిని ఎడ్‌సెట్ 2022లో అర్హత సాధించిన వారితో స్పాట్ అడ్మిషన్ల విధానంలో భర్తీ చేస్తామని చెప్పారు. ఖాళీల వివరాలు www.audoa.in వెబ్‌సైట్‌లో పొందుపరిచారన్నారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు తమ విద్యార్హత తెలిపే సర్టిఫికెట్లు, ఎడ్‌సెట్ ర్యాంక్ కార్డులతో నేరుగా హాజరుకావాలని సూచించారు.

# భక్తజన హోరు.. సంబరాలు జోరు



దీపారాధన చేస్తున్న మహిళ



బాలకృష్ణుని వేషధారణలో చిన్నారి



అమ్మవారి దర్శనానంతరం మాజీ సీఎస్ బిజయ మహాపాత్రొ

**బరంపురం:** దక్షిణ ఒడిశాలో ప్రసిద్ధి చెందిన మాబుడి శాంతమ్మ సంబరాలు రెండో రోజుకు చేరుకున్నాయి. గురువారం భక్తజనంతో మందిరం ప్రాంగణం కిక్కిరిసింది. వేలాది మంది గంటల కొద్దీ బారులుతీరి, అమ్మవారిని దర్శించుకున్నారు. మొక్కుబడులు చెల్లించుకుని, భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఉదయం 5 గంటలకే దేశిబెహరా వీధిలోని తాత్కాలిక సన్నిధికి చేరుకొన్నారు. అలాగే మహిళలు సామూహిక లలితా సహస్రనామ పారాయణ చేశారు. మరోవైపు ఆలయ ప్రాంగణం రాత్రి వేళల్లో విద్యుత్ దీపాల కాంతులతో ఆకట్టుకుంటోంది. నగరంలో ఎక్కడ చూసిన వివిధ రకాల వేషధారణలతో చిన్నారులు, పెద్దలు అలరిస్తున్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు, ఏర్పాట్లపై అధికారులు నిత్యం పర్యవేక్షిస్తున్నారు.




తాత్కాలిక మందిరంలో కొలువుదీరిన అమ్మవారు

# ఉసూరుమనిపించిన వరుణుడు

● చైత్రోత్సవాల తుది ఘట్టానికి వర్షం ఆటంకం
● ఆలస్యంగా కొనసాగిన 'నిప్పులపై నడక' సంప్రదాయం

**రాయగడ:** ఉత్కళాంధ్రుల ఆరాధ్యదైవం మజ్జిగౌరి అమ్మవారి చైత్రోత్సవాలు బుధవారం రాత్రి ముగిసాయి. ఇందులో భాగంగా ఆఖరి రోజు జరగాల్సిన సంప్రదాయ తుది ఘట్టాలకు వర్షం ఆటంకం కలిగించింది. దీంతో బుధవారం అర్ధరాత్రి వాటిని సంప్రదాయంగా పూర్తి చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉత్సవాల ముగింపు రోజు సాయంత్రం అమ్మవారి ప్రతి రూపాలైన ఘటాలను పూజారి వీధి, బెంగాళి వీధితో పాటు పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో సతొభ ావుణి మందిరం వరకు ఊరేగింపుగా తీసుకువెళ్తారు. ఈ మధ్య కాలంలో ప్రధాన ఘట్టాలైన నిప్పులపై పూజారి నడిచే కార్యక్రమానికి శ్రీకారం చుడతారు. దీనికి ముందుగా అగ్నిదేవునికి పూజా కార్యక్రమాలను నిర్వహించి, పెద్ద పెద్ద దుంగలతొ మంటలను వేస్తారు. అనంతరం వాటి నుంచి వచ్చే నిప్పులను సిద్ధం చేస్తారు. ఈ ప్రక్రియ పూర్తి చేసే సమయంలో ఏకధాటిగా వర్షం కురిసింది. దీంతో అగ్నిదేవునికి సంప్రదాయంగా చేసిన పూజలకు ఆటంకం ఏర్పడింది. పట్టణంలో తిరువీధికి వెళ్లేందుకు సిద్ధమైన ఘటాలు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. సుమారు బుధవారం రాత్రి 9గంటల సమయం వరకు వర్షం ఏకధాటిగా వర్షం కురవడంతో పాటు విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలగడంతో విధివిధానాలు నిలిచిపోయాయి. అనంతరం వర్షం తగ్గుముఖం పట్టడంతో రాత్రి 2గంటల అనంతరం తిరిగి అగ్గిని సిద్ధం చేశారు. అనంతరం యథావిధిగా పూజా కార్యక్రమాలను కొనసాగించారు. అనంతరం ముళ్లతో తయారు చేసే ఊయలతో పూజారి ఊగడంతో పాటు మల్లెలు తొక్కే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏటా ఈ ఘట్టాలను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతారు. అయితే వర్షం కారణంగా అంతగా భక్తులు లేకపోయినప్పటికీ విధివిధానాల ప్రకారం కార్యక్రమాలను పూర్తి చేయాల్సి వచ్చింది. అదేవిధంగా కుండపోత వర్షం కారణంగా చండీహోమాన్ని మధ్యలో నిలిపి, వర్షం తగ్గుముఖం పట్టిన తరువాత కొనసాగించారు.



ప్రత్యేక అలంకరణలో మజ్జిగౌరమ్మ



నిప్పులపై నడుస్తున్న పూజారి

**పాదల గుడికి ఘటాలు..**

గురువారం ఘటాలను పాదాల గుడికి తీసుకువెళ్లే కార్యక్రమంలో ఉత్సవాలకు ముగింపు పలికారు. ఈ సందర్భంగా ఘటాలను మోసుకుంటూ మందిరానికి సమీపంలోని అమ్మవారి పాదాల గుడివరకు తీసుకువెళ్లారు. ఈ సమయంలో పిల్లలు, పెద్దలు అడ్డంగా పడుకున్నారు. వారిని దాటుకుంటూ ఘటాలను తీసుకువెళ్లారు. ఇలా వెళ్తే.. అమ్మవారి అనుగ్రహం పొందవచ్చని భక్తుల విశ్వాసం.



ఘటాలకు అడ్డంగా పడుకున్న భక్తులు

# సందడిగా సెంచూరియన్ వార్షికోత్సవం

**పర్లాకిమిడి:** పట్టణంలోని సెంచూరియన్ పబ్లిక్ స్కూల్ ఆవరణలో వార్షికోవాలు గురువారం సందడిగా సాగాయి. వర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ సుప్రియా పట్నాయక్(భువనేశ్వర్) ముఖ్య అతిథిగా హాజరై, కార్యక్రమాలను ప్రారంభించారు. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ అనితా పాత్రొ, ఇతర అధికారులు పాల్గొన్నారు. విద్యార్థులు ప్రారంభ గీతాన్ని ఆలపించగా, స్కూల్ ప్రిన్సిపల్ సునీత పాణిగ్రాహి వార్షిక నివేదికను వినిపించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ సెంచూరియన్ విద్యార్థులు 10, ప్లస్2 సీబీఎస్‌ఈఓలో ఉన్నత ర్యాంకులు సాధించారని, ఇదే స్ఫూర్తితో ప్రస్తుతం విద్య అభ్యసిస్తున్న వారు కూడా రాణించాలని సూచించారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. వివిధ పోటీలు నిర్వహించగా, విజేతలకు బహుమతులు అందజేశారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వీసీ సుప్రియ పట్నాయక్



నృత్యాలతో ఆకట్టుకుంటున్న చిన్నారులు

# బిడ్డను కన్న నెల రోజులకే గెంటేశారు..

**తిరువళ్లూరు:** ప్రసవించిన నెల రోజులకే అత్తింటి వారు బిడ్డను బలవంతంగా లాక్కుని ఇంటి నుంచి గెంటేశారని ఆంధ్రకు చెందిన ఓ వివాహిత తమిళనాడు రాష్ట్రంలోని తిరువళ్లూరు మహిళా పోలీసు స్టేషన్ వద్ద గురువారం ఆందోళనకు దిగడం కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలం పెద్దకోమటిపేట ప్రాంతానికి చెందిన నాగులు బుజ్జిరామారావు కుమార్తె పద్మజ(38). సాలూరులో డిగ్రీని పూర్తి చేసి ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. మొదట భర్త నుంచి విడిపోయిన పద్మజ రెండవ వివాహం కోసం మ్యాట్రీమోనీలో తన వివరాలను నమోదు చేసుకున్నారు. పద్మజ వివరాలు తెలుసుకున్న తిరువళ్లూరుకు చెందిన ఇంజినీరింగ్ పట్టభద్రుడైన సుదర్శనం.. పద్మజ తల్లిదండ్రులను సంప్రదించినట్లు తెలుస్తుంది. ఈ నేపథ్యంలో 2021 జనవరి 25న తిరువళ్లూరులోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో వీరి వివాహం జరిగింది. వీరికి గత ఏడాది ఏప్రిల్‌లో ఓ బాబు జన్మించాడు. అయితే పద్మజ ప్రసవించిన నెల రోజులకే బాబుని లాక్కుని పుట్టింటికి తరిమేశారు. బిడ్డ కోసం తిరువళ్లూరు మహిళా పోలీసులను ఆశ్రయించిన పద్మజ పలుమార్లు ఫిర్యాదు చేసింది. అయితే పోలీసులు పట్టించుకోకపోవడంతో మహిళ పోలీసుస్టేషన్ ఎదుట ఆందోళనకు దిగింది. తన కుమారుడిని చూడడానికి కూడా అత్తారింటి వారు అనుమతించడం లేదని, ప్రశ్నిస్తే దాడులకు యత్నిస్తున్నారని విలపించింది. తమిళనాడు పోలీసులు న్యాయం చేయడం లేదని వాపోయింది.



పద్మజ - సుదర్శనం పెళ్లినాటి ఫొటో

### యువతిని మోసం చేసిన వ్యక్తి అరెస్ట్



ముద్దాయిని చూపిస్తున్న సీఐ ధనుంజయరావు

**సాలూరు:** ప్రేమ పేరుతో యువతిని శారీరకంగా లొంగదీసుకుని, పెళ్లికి నిరాకరించిన యువకుడుపై కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ ధనుంజయరావు తెలిపారు. గురువారం రూరల్‌స్టేషన్‌లో ఎస్‌ఐ ప్రయోగమూర్తితో కలిసి స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడారు. మండలంలోని చంద్రపువలస గ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని, అదే గ్రామానికి చెందిన ఇళ్ల పైడిరాజు నమ్మించాడు. ఆమెను శారీరకంగా లొంగదీసుకున్నాడని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నట్టు చెప్పారు. కాగా పెళ్లికి సదరు యువకుడు నిరాకరించడంపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు. ముద్దాయిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు.

### రెండు బైక్‌లు ఢీ : ఇద్దరికి గాయాలు

**రాజాం సిటీ:** మండల పరిధి కంచరాం గ్రామం జంక్షన్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు వ్యక్తులు గాయాల పాలయ్యారు. రాజాంకు చెందిన శ్రీనివాసరావు, మానాపురానికి చెందిన ఈశ్వరరావు ద్విచక్ర వాహనాలపై ఎదురెదురుగా ఢీకొనడంతో గాయపడ్డారని స్థానికులు తెలిపారు. వీరిని 108 వాహనంలో రాజాంలోని కేర్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

# ఖుర్దారోడ్‌లో బాలాజీ బ్రహ్మోత్సవాలు

● స్వామివారికి నిలువెత్తు వెండి ఆభరణాల కానుక



అష్టోత్తర శతకలశ స్నపన మహోత్సవం



స్వామివారికి భక్తులు సమర్పించిన నిలువెత్తు వెండి ఆభరణాలు

**భువనేశ్వర్:** ఖుర్దారోడ్ అకౌంట్స్ కాలనీ కొండపై నెలకొన్న బాలాజీ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 9వరకు ఈ ఉత్సవాలు కొనసాగుతాయి. ధ్వజారోహణ కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా దేవస్థానం 30వ వార్షికోత్సవం నిర్వహణకు భారీ ఏర్పాట్లు చేశారు. వార్షికోత్సవం పురస్కరించుకుని భక్తులు స్వామివారికి సుమారు 11కిలోల వెండి ఆభరణాలను గురువారం కానుకగా సమర్పించారు. ఈ ఆభరణాల్లో వక్షస్థలం, శంఖచక్రాల చేతులు, అభయ, కటిహస్తం, పాదాలు, కిరీటం ఉన్నట్లు బాలాజీ సేవాసమితి వర్గాలు పేర్కొన్నాయి. ధ్వజారోహణ పురస్కరించుకుని మంగళధ్వని, విశ్వక్షేన పూజ, అంకురార్పణ, అగ్నిప్రతిష్ట, మండప ఆరాధన ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే స్వామివారు గరుడ వాహనంపై ఖుర్దారోడ్ వీధుల్లో ఊరేగి, భక్తులకు చేరువలో దర్శనభాగ్యం కల్పించారు. అష్టోత్తర శత కలశ స్నపనం, దర్బారు సేవ, ఊంజల సేవ ప్రత్యేక కార్యక్రమాలతో మహిళల కోలాటం, భక్తులను విశేషంగా అలరించాయి. నిత్యం సుప్రభాతం, అర్చన పూజాదులతో ఉత్సవ ప్రత్యేక పూజాదులు, ఊరేగింపు ఇతరేతర కార్యక్రమాలు చేపడతారు. ఈ సందర్భంగా లక్ష్మి, నవగ్రహ, వాస్తు, ధన్వంతరి, రుద్ర, అయ్యప్ప తదితర పరివార దేవతల విశేష హోమాదుల కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధానార్చకులు రంగాభట్ల ధనుంజయ ఆచార్యులు తెలిపారు.



ఆలయ ప్రాంగణంలో ధ్వజారోహణ ఉత్సవం

# జేఎన్‌టీయూ జీవీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కి డాక్టరేట్



డాక్టర్ పద్మజ

**విజయనగరం అర్బన్:** జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగాధిపతి అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎ.పద్మజకు జేఎన్‌టీయూ కాకినాడ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. 'ఆటోమేటిక్ జనరేషన్ కంట్రోల్ ఆఫ్ మల్టీ ఏరియా హైబ్రిడ్ పవర్ సిస్టమ్స్' అనే అంశంపై ఆమె చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ ప్రధానం చేశారు. పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తిని పెంచేందుకు పునరుత్పాదక శక్తిని గ్రిడ్‌కు అనుసంధానం చేయాల్సిన అవసరాన్ని గుర్తించి ఈ పరిశోధన చేసినట్లు ఆమె తెలిపారు. మెషిన్ లెర్నింగ్ టెక్నిక్ అయిన సపోర్ట్ వెక్టార్ కంట్రోలర్‌ని ఉపయోగించి సౌర మరియు వాయుశక్తి గ్రిడ్‌కు అనుసంధానం చేయడం వల్ల ఫ్రీక్వెన్సీ మరియు టై లైన్లో పవర్లో వచ్చే మార్పులను ఆటోమెటిక్‌గా కంట్రోల్ చేయటమే ఈ పరిశోధన ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. పీహెచ్‌డీ పొందిన డాక్టర్ పద్మజను జేఎన్‌టీయూ జీవీ వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.స్వామినాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.గురునాథ, వివిధ విభాగాల అధిపతులు అభినందనలు తెలిపారు.

# సైనికుడి మృతి తీరని లోటు

**చీపురుపల్లి:** విధి నిర్వహణలో శిక్షణ పొందుతూ మృతి చెందిన ఇండియన్ నేవీ సైనికుడు(పీటీ ఆఫీసర్) చందక గోవింద్ మృతికి జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ సంతాపం తెలిపారు. కోల్‌కత్తాలో జరుగుతున్న పారా గ్లెడ్డింగ్ శిక్షణలో పారాచూట్ తెరుచుకోకపోవడంతో గోవింద్ మృతి చెందడం తీరని లోటని పేర్కొన్నారు. చీపురుపల్లి మండలంలోని పర్ల గ్రామానికి చెందిన చందక గోవింద్ ఇండియన్ నేవీలో ఉద్యోగం చేస్తూ పారా గ్లెడ్డింగ్‌లో శిక్షణ పొందుతూ మృతి చెందడం స్థానికంగా అందరినీ కలచివేసిందని తెలిపారు. దేశం రక్షణ కోసం శిక్షణ పొందుతూ ప్రాణాలు విడిచిన గోవింద్ మృతి కుటుంబంతో పాటు సమాజానికి తీరని లోటని తెలిపారు. అయితే పారాచూట్ తెరుచుకోకపోవడంపై సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ తెలిపారు. త్వరితగతిన మృతదేహాన్ని స్వగ్రామానికి పంపాలని కోరినట్లు వివరించారు.

### ఇద్దరు మత్స్యకారులపై కేసు నమోదు

**వంగర:** మండల పరిధి మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టులో అక్రమంగా చేపలు వేట సాగిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బుడుమూరు లోకేశ్వరరావు గురువారం తెలిపారు. లీజు సొమ్ము ప్రభుత్వానికి చెల్లించకపోవడంతో ప్రాజెక్టులో చేపలు వేటను నిషేధిస్తూ మత్స్యశాఖ అధికారులు గతంలో ఉత్తర్వులు జారీ చేశారు. నిబంధనలు ఉల్లంఘించి ప్రాజెక్టులో చేపలు వేట సాగిస్తున్న మండల పరిధి పటువర్ధనం గ్రామానికి చెందిన మత్స్యకారులు మురగడాపు పోలిపల్లి, మురగడాపు దుర్గారావులపై మద్దివలస, సంగాం సచివాలయాల ఫిషరీస్ అసిస్టెంట్‌లు రఘురాం, చైతన్యలు వంగర పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## న్యూస్‌రీల్

### పొందూరులో మైనింగ్ విజిలెన్స్ దాడులు

పొందూరు: పొందూరు మండలంలో మైనింగ్ విజిలెన్స్ అధికారులు గురువారం దాడులు జరిపారు. మైనింగ్ డీడీ ఫణిభూషణ్ రెడ్డి, ఏడీ బాలాజీనాయక్, విజిలెన్స్ ఏడీ వెంకటేశ్వర్లు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్లు నాగేశ్వరరావు, నాగరాజులు దాడులు చేశారు. అనుమతులు లేకుండా చిప్స్, రాళ్లు, మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రెండు టిప్పర్లు, నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నారు. వాహనాలను సీజ్ చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు.

### 'తక్షణమే అరెస్ట్ చేయాలి'



బాధితులతో మాట్లాడుతున్న దళిత నాయకులు

సంతబొమ్మాళి: మండలంలోని దండుగోపాలపురం గ్రామానికి చెందిన దళితులపై దాడికి పాల్పడిన అరంగి వసంతరావు, విష్ణు, అరుణ్ కుమార్, బాలక ప్రసాద్, బాలక నారాయణరావు, రాములపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, తక్షణమే అరెస్ట్ చేయాలని దళిత నాయకులు కోరారు. ఈ మేరకు బాధిత కుటుంబాలను గురువారం పరామర్శించారు. దాడిని సమతా సైనిక్ దళ్ జిల్లా సమన్వయకర్త చల్లా రామారావు, ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు తల సముద్రం సూర్యం ఖండించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను ధ్వంసం చేసి సర్వం కోల్పోయిన బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

### జేఈఈ మెయిన్స్ ప్రారంభం



శివానీలో విద్యార్థుల హాల్ టిక్కెట్లు పరిశీలిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి జేఈఈ మెయిన్స్ ఆన్‌లైన్ పరీక్షలు చిలకపాలేంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కాలేజ్, ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజీల్లో గురువారం ప్రారంభమయ్యాయి. రోజూ ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలు ఈ పరీక్షలు జరుగుతున్నాయి. గురువారం ప్రారంభమైన పరీక్షలు ఈ నెల 8, 10, 11, 12, 13, 15 తేదీల్లో జరగనున్నాయి. మొదటి రోజు పరీక్షలు సజావుగా జరగ్గా, శివానీలో మొదటి షిఫ్ట్‌లో 84 మందికి 81 మంది హాజరుకాగా, ముగ్గురు గైర్హాజరయ్యారు. రెండో షిఫ్ట్‌లో 83 కి 77 మంది హాజరు కాగా, ఆరుగురు గైర్హాజరయ్యారు. ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వరాలో మొదటి షిఫ్ట్‌లో 100కి 98 మంది హాజరు కాగా, ఇద్దరు గైర్హాజరయ్యారు. రెండో షిఫ్ట్‌లో 100కి 99 మంది హాజరు కాగా, ఒకరు గైర్హాజరయ్యారు. మొదటి రోజు పరీక్షలు సజావుగా జరిగాయి. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పరీక్షలు నిర్వహిస్తోంది.

### హిందీ పరీక్షకు 194 మంది గైర్హాజరు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో 10వ తరగతి పరీక్షలు పకడ్బందీగా జరుగుతున్నాయి. మొత్తం 149 కేంద్రాల్లో గురువారం జరిగిన హిందీ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 28,782 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా వివిధ కారణాలతో 194 మంది గైర్హాజరయ్యారు. డీఈఓ గార పగడాలమ్మ పరీక్షల తీరును పర్యవేక్షిస్తున్నారు. అలాగే పాఠశాల విద్యాశాఖ నియమించిన రాష్ట్ర పరిశీలకులు ఆర్.విజయ్‌కుమార్ పలాస మండలంలోని పలు కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు.

**ప్రశాంతంగా ఓపెన్‌స్కూల్ పరీక్షలు**

జిల్లాలో ఓపెన్ స్కూల్ 10, ఇంటర్ పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. 10వ తరగతి పరీక్షలకు 28 మంది విద్యార్థులు గైర్హాజరు కాగా ఓపెన్ ఇంటర్ పరీక్షలకు 50 మంది డుమ్మా కొట్టారు. జిల్లా ఓపెన్ స్కూల్ కో-ఆర్డినేటర్ ఎల్.ఆలీఖాన్ పర్యవేక్షిస్తున్నారు.

### గంజాయి, నల్లమందు పట్టివేత

కోటబొమ్మాళి: మండలంలోని పెద్దబమ్మిడి, ఎత్తురాళ్లపాడు గ్రామాల మధ్య గంజాయి, నల్లమందు విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసు లు అదుపులోకి తీసుకున్నారు. ఈ రెండు గ్రామాల మధ్య జాతీయ రహదారి పక్కన కిరాణా షాపులో గంజాయి, నల్లమందు విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఆ మేరకు కోటబొమ్మాళి పోలీసులు గురువారం దాడి చేయగా గుజరాత్ రాష్ట్రానికి చెందిన ముగ్గురు వ్యక్తులు పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి 0.45గ్రాముల గంజాయి, 2.35 గ్రాముల నల్లమందును స్వాధీనం చేసుకున్నట్లు కోటబొమ్మాళి ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐ డి.ప్రభాకరరావు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

# మదీనాబాబా చందనోత్సవానికి వేళాయె..!

- హిందూ-ముస్లిం సమైక్యతకు చిహ్నంగా కళింగపట్నం మదీనా దర్గా
- ముమ్మరంగా ఏర్పాట్లు



కళింగపట్నంలో దర్గా ఎదురుగా ఉన్న ప్రార్థనా మందిరం



మదీనాబాబా సమాధి

గార: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే కళింగపట్నం మదీనా దర్గా ఉర్సు ఉత్సవం (చందనోత్సవం) శనివారం నిర్వహించనున్నారు. ఏటా ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొనే ఉరుసు ఉత్సవం రంజాన్‌లో నెలవంక ప్రారంభం నుంచి 16వ రోజున జరుపుతారు. ఈ ఏడాది శుక్రవారం ప్రారంభించి ఆదివారంతో ముగియనుందని హజరత్ కళింగ మదీనాబాబా దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. ఈ దర్గాకు ఉత్తరాంధ్ర నుంచి ముస్లింలతో పాటు హిందూ భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తుంటారు. 11వ శతాబ్దంలో పవిత్ర మక్కా నగరం నుంచి మదీనా బాబా ఇక్కడికి వచ్చినట్టు తెలుస్తోంది. ఆ తరువాత రోజుల్లో ఇక్కడే జీవసమాధి పొందారు. హిందూ ముస్లింల సమైక్యతకు వారధిగా నిలుస్తోంది ఈ మదీనా దర్గా. ప్రతీ రోజు ముస్లింలు ఇక్కడ నమాజ్ చేస్తుంటారు. ప్రతి గురువారం అధిక సంఖ్యలో హిందువులు తరలివచ్చి దర్గా వెనుక ఉన్న స్తంభం వద్ద అగరుబత్తీలు వెలిగించి పూజలు చేస్తుంటారు. విలువైన వస్తువులు పోగొట్టుకున్న సమయాల్లో బాబాకు మొక్కుకుంటే అవి దొరకుతాయని భక్తుల్లో బలమైన నమ్మకం. ఆ వస్తువులు దొరికిన తర్వాత అటుకులు ప్రసాదాన్ని చిన్నారులకు పంచడం ఆనవాయితీగా వస్తోంది.

**కార్యక్రమాలు ఇలా..**

- శుక్రవారం గౌస్‌పాక్ జెండా ఆవిష్కరణ, ఖురాన్ పఠనం, అన్నదానం
- శనివారం ఉదయం 5 గంటల నుంచి ముజావరుల సన్నిధిలో బాబాగసూల్ (సమాధి శుద్ధి) నిర్వహిస్తారు. 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు నిజరూప దర్శనం, ఖురాన్ పఠనం
- సాయంత్రం 4 గంటల నుంచి బాబా చాదర్, చందనం ఊరేగింపు, అనంతరం సమాధిపై చాదర్ కప్పుతారు.
- ఆదివారం ఉపవాస దీక్ష విరమణ

# కొడుకును వెతికేందుకు వెళ్లి..

- ఆటో బోల్తా పడి తండ్రి మృతి
- కుమారుడితో పాటు మరో ఇద్దరికి గాయాలు



మృతి చెందిన గంగయ్య

కోటబొమ్మాళి: కొడుకు చిన్నపాటి అలక తండ్రి ప్రాణాలను బలికొంది. చిరుకోపంలో ఇంటి నుంచి వెళ్లిపోయిన కుమారుడిని వెతికేందుకు బయల్దేరిన తండ్రి తిరిగి ఇంటికి మృతదేహమై చేరాడు. రేగులపాడు వద్ద బుధవారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటన స్థానికులను కంటతడి పెట్టించింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కొస్తూరిపాడు పంచాయతీ గంగుపేటకు చెందిన కొయ్యాన మోహనరావు గురువారం రాత్రి 10 గంటల సమయంలో అతని భార్యతో గొడవపడి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. మోహనరావును వెతికేందుకు తండి కొయ్యాన గంగయ్య(53) గ్రామానికి చెందిన కొర్రాయి కృష్ణారావు, ఆటో డ్రైవర్ రావుల హరిశ్చంద్రలతో కలిసి ఆటోలో బయల్దేరాడు. చల్లపేట వైపు వెళ్లి వెతకగా అక్కడ మోహనరావు కనిపించాడు. కొడుక్కి నచ్చజెప్పి అర్ధరాత్రి సమయంలో అంతా తిరిగి ఇంటికి ప్రయాణమయ్యారు. అయితే రేగులపాడు వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి వీరి ఆటో చెట్టును ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటో వెనుక కూర్చున్న గంగయ్య మృతి చెందగా, మిగిలిన ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. వీరిని కోటబొమ్మాళి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ షేక్ మహ్మద్ అలీ తెలిపారు.

### రెవెన్యూ శాఖలో పాత వాహనాల వేలం

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని రెవెన్యూ విభాగంలో కాల పరిమితి ముగిసిన తొమ్మిది వాహనాలను ఈ నెల 21వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో బహిరంగ వేలం వేయనున్నట్టు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి ఓ ప్రకటనలో తెలిపారు. రవాణా శాఖ నిబంధనల ప్రకారం, రవాణా శాఖ అధికారుల సమక్షంలో వేలం నిర్వహిస్తామని తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు ఫర్మ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, జీఎస్టీ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌తో ఈనెల 20వ తేదీ మధ్యాహ్నం 2 గంటల్లోగా వివరాలు నమోదు చేసుకుని, దరఖాస్తు కోసం రూ.1,000 డిమాండ్ డ్రాఫ్టును కలెక్టర్, శ్రీకాకుళం పేరున చెల్లించి, 21న జరిగే వేలం పాటలో పాల్గొనాలని కోరారు. పాట అనంతరం డబ్బును మూడు రోజుల్లోగా చెల్లించి, వాహనాలను ఐదు రోజుల్లో తీసుకుని వెళ్లాలని తెలిపారు.

# 60 ఎకరాల్లో పలాసలో కొత్త పారిశ్రామికవాడ



మాట్లాడుతున్న పలాస జీడి పారిశ్రామిక వేత్తలు

కాశీబుగ్గ: పలాస జీడి పరిశ్రమలకు తోడ్పాటు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చిందని, దీనిలో భాగంగా రామకృష్ణాపురం రెవెన్యూ పరిధిలో 60 ఎకరాలలో మరో పారిశ్రామికవాడ ఏర్పాటుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అంగీకారం తెలియజేయడం సంతోషంగా ఉందని పలాస కాష్యూ మాన్యుఫ్యాక్చర్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లా సురేష్‌కుమార్ అన్నారు. గురువారం పలాసలోని మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2018లో తిత్లీ తుఫాన్ సమయంలో పరిశ్రమలు దెబ్బతిన్నా, జీడిపిక్కలు తడిసి ముద్దయినా అప్పటి టీడీపీ ప్రభుత్వం ఎటువంటి సాయం అందించలేదని గుర్తు చేశారు. సకాలంలో విద్యుత్ రాక పరిశ్రమలు మూతపడటంతో నిరసన తెలిపిన వ్యాపారులకు తిరిగి బెదిరింపులకు గురి చేశారన్నారు. టీడీపీయేతర వ్యాపారులపై ఇన్‌కం టాక్స్ దాడులు జరిగేవని, నూతన యంత్రాలు తీసుకుని వస్తే రూ.25 లక్షల వరకు జరిమానాలు విధించేవారని గుర్తుచేశారు. కరోనా సమయంలో దేశమంతా పరిశ్రమలు మూతపడితే పలాసలో మాత్రం కొనసాగాయని చెప్పారు. కొత్త పారిశ్రామికవాడ ఏర్పాటుతో సుమారు 20 వేల మందికి ఉపాధి లభిస్తుందని, ఇంతటి పెద్ద ఇండస్ట్రియల్ పార్కును తక్కువ సమయంలో ఏర్పాటు చేయడంపై మంత్రి అప్పలరాజుకు, ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలుపుతున్నామని చెప్పారు. సమావేశంలో పలాస ఇండస్ట్రియల్ ఎస్టేట్ అధ్యక్షుడు మల్లా రామేశ్వరం, ఏఎంసీ అధ్యక్షుడు పి.వి.సతీష్, తూముల శ్రీనివాసరావు, పట్నాన రవికాంత్, కె.వి.శివకృష్ణ, శాశనపురి శ్రీనివాసరావు, సనపల సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

### సైకిల్‌పై శాంతియాత్ర



అరసవల్లి చేరుకున్న విజయగోపాలకృష్ణ

అరసవల్లి: కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా చిందనూర్ పట్టణానికి చెందిన విజయగోపాల కృష్ణ చేపట్టిన శాంతి సైకిల్ యాత్ర గురువారం అరసవల్లి క్షేత్రానికి చేరింది. దేశ శాంతి, జలవనరుల సంరక్షణ లక్ష్యంగా గత ఏడాది మార్చి 11న చిందనూర్‌లో ఈ యాత్ర ప్రారంభించా రు. అరసవల్లి, శ్రీకూర్మం క్షేత్రాలను దర్శించు కున్నారు. ఇప్పటివరకు 13 రాష్ట్రాల మీదుగా 11 నదులను దాటుకుంటూ అరసవల్లి చేరుకున్నానని, ఇలాగే ఒడిశా రాష్ట్రం పూరీ క్షేత్రానికి వెళ్లి యాత్రను ముగిస్తానని ప్రకటించారు.

# వైద్యం మరింత సులభం



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

అరసవల్లి: అద్భుతమైన ఆరోగ్య పథకానికి వైద్యాధికారులు గురువారం శ్రీకారం చుట్టారు. జిల్లా వ్యాప్తంగా ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని పూర్తి స్థాయిలో గురువారం ప్రారంభించడంతో గ్రామీణ ప్రాంతాలకు వైద్య సేవలు మరింత చేరువ కానున్నాయి. మొత్తం 30 మండలాల్లోనూ మొబైల్ మెడికల్ యూనిట్ (104) వాహనాల సేవలు గ్రామీణ ప్రజల కు అందించారు. అలాగే డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.మీనాక్షి, నోడల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మీతులసిల ఆధ్వర్యంలో పీహెచ్‌సీల విధుల్లో ఉన్న 132 మంది వైద్యులు ట్రయల్ రన్ అనుభవంతో తొలిరోజున ఈ విధానాన్ని రెగ్యులర్ చేశారు. ఉదయం 9 గంటల నుంచి ఓపీ విభాగాన్ని ప్రారంభించి, మధ్యాహ్నం 2 గంటల నుంచి గ్రామాల్లో ఇంటిలో మంచానికే పరిమితమైన రోగులను నేరుగా వెళ్లి పరామర్శించారు. మందుల వాడకాలను అడిగి తెలుసుకున్నారు.

ఈ ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రారంభించిన అనంతరం జిల్లాలో ప్రధాన కార్యక్రమంగా ఆమదాలవలస మండలం కణుగులవలసలో అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఈ విధానాన్ని ప్రారంభించారు. అలాగే పలాసలో మంత్రి సీదిరి అప్పలరాజు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా, నరసన్నపేట నియోజకవర్గం పోలాకి మండలం మబుగాంలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా, టెక్కలి మండలం లింగాలవలసలో జెడ్పీటీసీ దువ్వాడ వాణి ప్రారంభించారు. అలాగే పాతపట్నంలో ఎమ్మెల్యే రెడ్డి శాంతితో పాటు మిగిలిన నియోజకవర్గాలు, మండలాల్లో ఆయా మండల ఎంపీపీలు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా నోడల్ అధికారి డాక్టర్ లక్ష్మీతులసి మాట్లాడుతూ జిల్లాలో ఫ్యామిలీ డాక్టర్ విధానం విజయవంతంగా ప్రారంభమైందని, ఒక్క రోజులో 30 మండలాల్లో 66 పీహెచ్‌సీల పరిధిలో 2,248 మంది రోగులు ఓపీ సేవలను వినియోగించుకున్నారని, వీరికి ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లుగా వివరించారు. ఇక ప్రతి నెలా రెండు సార్లు ప్రతి గ్రామానికి ఈ ఫ్యామిలీ డాక్టర్ సేవలు అందుబాటులో ఉంటాయని, ప్రజలు ఈ ప్రత్యక్ష సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

### 10న అప్రెంటీస్ మేళా

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రం (ఐటీఐ)లో ఈ నెల 10న అప్రెంటీస్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కె.ఎస్.శ్రీనివాసరావు చెప్పారు. ఎచ్చెర్ల ఐటీఐలో గురువారం ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌కు చెందిన మేదా సర్వో ప్రైవేట్ లిమిటెడ్, అక్షయ సోలార్ సిస్టమ్స్, స్థానిక పరిశ్రమలైన యూనైటెడ్ బ్రూవరీస్, రెడ్డీస్ ల్యాబ్స్, శ్యాంక్రగ్ పిస్టన్స్, ఆంధ్రాఆర్గానిక్స్ పరిశ్రమల ప్రతినిధులు హాజరు కానున్నారని చెప్పారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, వెల్డర్, ఎలక్ట్రానిక్స్ మెకానికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్ మెకానిక ల్ ట్రేడుల్లో చదివిన వారు అర్హులని పేర్కొన్నారు. విద్యార్థులు ఆధార్, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో 10వ తేదీన ఉదయం 9 గంటలకు హాజరు కావా ల ని సూచించారు. హెచ్‌టీటీపీఎస్://డీజీఈటీ.జీవోవీ.ఇన్//ఏపీపీ మేళా/ 2022లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, పూర్తి వివరాలకు 9128767345, 9849988879 నంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

### ఏడుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

ఇచ్ఛాపురం రూరల్: తనను కులం పేరుతో దూషించారని కొళారీ గ్రామానికి చెందిన డోపా సులోచన ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈదుపురం గ్రామానికి చెందిన ఏడుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ కె.రామకృష్ణ తెలిపారు. తన భూమిని ఈదుపురం గ్రామానికి చెందిన ఎస్.రామకృష్ణ, బి.చెల్లయ్య, ఎ.శ్యామ్‌సుందరరావు, బి.అప్పారావు, బి.హేమారెడ్డి, ఎ.వాసుదేవరావు, తరుణ్ బెహరాలు ఆక్రమించుకున్నారని, తన భూమి ఇవ్వాలని కోరగా, కులం పేరుతో దూషించారంటూ ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు.

### నెలాఖరులోగా పన్ను చెల్లిస్తే ఐదు శాతం రాయితీ

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఇంటి పన్నులు, ఖాళీస్థలం పన్నులు ఈ నెలాఖరులోగా చెల్లిస్తే 5 శాతం రాయితీ పొందవచ్చని శ్రీకాకుళం కార్పొరేషన్ కమిషనర్ చల్ల ఓబులేసు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పన్నులను వ్యయ ప్రయాసలకు ఓర్చి కార్పొరేషన్ కార్యాలయంలోనే కట్టాల్సిన పనిలేదని, సమీప సచివాలయంలోనూ చెల్లించవచ్చని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ పన్నులు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని కోరారు.

### 10న బీఈడీ మిగులు సీట్ల భర్తీ

ఏయూ క్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో బీఈడీ, బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సుల్లో మిగులు సీట్ల భర్తీకి ఈ నెల 10న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఏయూ ప్రవేశాల సంచాలకు డు ఆచార్య డి.ఎ.నాయుడు ఒక ప్రకటనలో తెలిపా రు. ఏయూ ఆర్ట్స్ కళాశాల, ఐఏఎస్ఈలో కొన్ని సీట్లు మిగిలాయని, వీటిని ఎడ్‌సెట్ 2022లో అర్హత సాధించిన వారితో స్పాట్ అడ్మిషన్ల విధానంలో భర్తీ చేస్తున్నామని పేర్కొన్నారు. ఖాళీల వివరాలు www.audoa.in వెబ్‌సైట్‌లో పొందుపరిచారన్నారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు నేరుగా తమ విద్యార్హత తెలిపే సర్టిఫికెట్లు, ఎడ్‌సెట్ ర్యాంక్ కార్డులతో నేరుగా హాజరు కావాలని సూచించారు.

# పోర్టు శంకుస్థాపనకు సన్నద్ధం

- మంత్రి సీదిరి అప్పలరాజు



పలాస మంత్రి క్యాంప్ కార్యాలయంలో పోర్టు అధికారులతో మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: భావనపాడు పోర్టుకి సంబంధించి పర్యావరణ అనుమతులు పూర్తి కానున్నాయని, అన్నీ సవ్యంగా జరిగితే ఈ నెల మూడో వారంలో పోర్టు శంకుస్థాపన జరుగుతుందని, ఆ కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కూడా వస్తారని మంత్రి సీదిరి అప్పలరాజు చెప్పారు. దీని కోసం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. ఏపీ ఎంబీఎండీ, ప్రభుత్వ స్పెషల్ సెక్రటరీ టీఎస్‌ఎన్ మూర్తి, విశ్వ సముద్ర ఎండీ జయచంద్ర, సుధీర్ ముందస్తు ఏర్పాట్లకు సంబంధించిన సూచనల కోసం గురువారం రాత్రి మంత్రిని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి చర్చించారు. అనంతరం పోర్టు నిర్మాణానికి సంబంధించిన అనేక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ల్యాండ్ ఎక్విజేషన్, ఆర్‌ఎండ్‌ఆర్‌కాలనీ నిర్మాణానికి కావాల్సిన ల్యాండ్ ఎక్విజేషన్ కూడా మూడో వారం లోనే పూర్తి చేస్తామని, వీటన్నిటి పనులకు సైతం శంకుస్థాపనకు సిద్ధం చేయాలని మంత్రి డాక్టర్ సీదిరి సూచించారు.

### ఎకరాకు రూ. 25 లక్షలు ఇస్తాం

- నౌపడ గ్రామసభలో సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి



నౌపడ గ్రామ సభలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి

సంతబొమ్మాళి: భావనపాడు పోర్టు అనుసంధాన రోడ్డుకు భూములు ఇచ్చే రైతులకు ఎకరాకు రూ.25 లక్షలు పరిహారాన్ని టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి ప్రకటించారు. పోర్టు నిర్మాణ ప్రాంతం నుంచి 16వ జాతీయ రహదారిని అనుసంధానించే స్పీడ్ యాక్సిస్ రోడ్డు భూసేకరణ కోసం గురువారం నౌపడ సచివాలయంలో పోర్టు డిప్యూటీ కలెక్టర్ అంబ్రీష్ ఆధ్వర్యంలో రైతులతో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత ప్రభుత్వ ధర రెండింతలు చేసి రూ.22.50 లక్షలు ఇస్తామని సబ్ కలెక్టర్ ప్రకటించారు. దీన్ని తిరస్కరించిన రైతులు ఎకరాకు రూ.40 లక్షలు కావాలని డిమాండ్ చేశారు. చివరకు ఎకరా భూమికి రూ.25 లక్షలు చొప్పున చెల్లిస్తామని స్పష్టం చేశారు. దీంతో రైతులు అంగీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చలమయ్య, ఆర్‌ఐ చంద్రమౌళి, సర్వేయర్ బాలరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ పిలక రవికుమార్‌రెడ్డి, లోపింటి రాములు, బత్సల సుధాకర్, మూలపేట సర్పంచ్ బాబురావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రసూతి సిబ్బంది నిర్లక్ష్యంపై విచారణ



విచారణ చేస్తున్న సబ్ కలెక్టర్, డిప్యూటీ కలెక్టర్

టెక్కలి: ఈ నెల 2న అర్ధరాత్రి సమయంలో మందస మండలం హంన్నాలి గ్రామానికి చెందిన గర్భిణికి టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవం చేసే విషయంలో ప్రసూతి విభాగానికి చెందిన సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఘటనపై గురువారం టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి, డిప్యూటీ కలెక్టర్ అంబరీష్ నేతృత్వంలో డీసీహెచ్‌ఎస్ భాస్కరరావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ లక్ష్మీ తులసీ, సూపరింటెండెంట్ సూర్యారావు, ప్రసూతి వైద్యులు ధనలక్ష్మి, జ్ఞానప్రసూణ, ఈఎన్‌టీ శ్రీరాములు, మేటీ అసిస్టెంట్ పాపమ్మతో పాటు సంఘటన జరిగిన రోజున విధుల్లో ఉన్న మొత్తం సిబ్బంది, హరిపురం పీహెచ్‌సీ పరిధిలోని వైద్యుడు, సంఘటన రోజున గర్భిణితో వచ్చిన ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్త, ప్రసవం చేసిన 108 సిబ్బంది, బాధితురాలు దేవకినాయక్ కుటుంబసభ్యులను సుదీర్ఘంగా విచారించారు. ప్రసవం చేసే విషయంలో మేటీ అసిస్టెంట్ పాపమ్మ నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు చివరగా నిర్ధారణ జరిగింది. దీంతో ఆమెపై శాఖాపరంగా చర్యలు తీసుకోవాలని సబ్‌కలెక్టర్, డిప్యూటీ కలెక్టర్ సిఫారసు చేశారు. ఈ ఘటనపై కలెక్టర్‌కు పూర్తి వివరాలతో నివేదిక అందజేస్తామన్నారు.

# ఆన్‌లైన్‌లో ఫీవర్ కేసుల నమోదు

- ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలకు డీఎంహెచ్‌ఓ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ మీనాక్షి

అరసవల్లి: జిల్లాలో జ్వరాల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో అన్ని ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు ఫీవర్ కేసుల వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ బి.మీనాక్షి ఆదేశించారు. గురువారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చికెన్‌గున్యా వంటి వ్యాధుల కేసులను ప్రభుత్వ వైద్యశాఖ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. గ్రామాల వారీగా నమోదవుతున్న కేసుల వివరాలను ప్రతినెలా 28వ తేదీలోగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. యాజమాన్యాలు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అడిషినల్ డీఎంహెచ్‌ఓ అనూరాధ మాట్లాడుతూ పీసీపీఎన్‌డీటీ చట్టం ఫారం-ఎఫ్‌ను ఈ నెల 25లోగా డీఎంహెచ్‌వో కార్యాలయానికి పంపించాలన్నారు. ఐటీ మేనేజర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఫీవర్ కేసుల వివరాలను ఫారం-పి, ఫారం-ఐలో నమోదు చేయాలని, ఎలాంటి సందేహాలున్నా 8639074149, 9491764543 నంబర్లను సంప్రదించాలని సూచించారు. సమావేశంలో ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్య ప్రతినిధులు డాక్టర్లు అమ్మన్నాయుడు, చంద్రానాయక్, మందుల మోహనరావు, తిరుపతిరావు, డీఐఓ ఆర్‌వీఎస్.కుమార్ పాల్గొన్నారు.

### క్రీడలతో ఉజ్వల భవిష్యత్



క్రికెట్ పోటీల విజేత మందస జట్టుకు కప్ అందజేస్తున్న ఎస్పీ రాధిక

మందస: యువత నేరాలకు దూరంగా ఉండాలని ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. మందస పట్టణంలోని శ్రీరాజా శ్రీనివాస స్మారక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురువారం జరిగిన ఎస్పీ కప్-2023 పోటీలు ముగింపు సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. చిన్నప్పటి నుంచే క్రీడలను కూడా విద్యలో భాగంగా చేసుకోవాలని, దీంతో మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. అనంతరం పలాస నియోజకవర్గం స్థాయిలో నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు బహుమతులు, క్రీడాపరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన థింసా, కూచిపూడి, జాతీయ సమగ్రతను చాటిచెప్పే నాట్యాలు ఆకట్టుకున్నాయి. ఎస్పీ రాధిక సాధించిన విజయాలతో కూడిన డాక్యుమెంటరీని ప్రదర్శించారు. కార్యక్రమాలను ఘనంగా నిర్వహించిన ఎస్‌ఐ ఎస్.రవికుమార్‌ను ఎస్పీ అభినందించారు. పవన్ పుత్రసేవాసంస్థ, స్పందన, సాంస్కృతిక వేదికతో పాటు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, స్థానికులు సేవలందించారు. కార్యక్రమంలో సర్పంచ్ చెరుకుపల్లి యల్లమ్మ, లక్ష్మణమూర్తి, డీఎస్పీ ఎం.శివరామిరెడ్డి, ఎస్పీఎక్స్ సీఐ ఎం.శ్రీనివాసరావు, పలాస సీఐ జి.శంకరరావు, వజ్రపుకొత్తూరు ఎస్‌ఐ వై.మధుసూదనరావు పాల్గొన్నారు.

# ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు



నైరా విద్యార్థులు ఏర్పాటు చేసిన రైతు ప్రదర్శనను తిలకిస్తున్న శాస్త్రవేత్తలు, రైతులు

కోటబొమ్మాళి: వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తూ ఆధునిక పద్ధతులతో సేద్యం చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని నైరా-కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు అన్నారు. గురువారం కోటబొమ్మాళి మండలం ఎత్తురాళ్లపాడులో నైరా కళాశాలకు చెందిన 33 మంది విద్యార్థులు వ్యవసాయ ప్రదర్శనను ఏర్పాటుచేసి ఆధునిక సేద్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అనకాపల్లి పరిశోధన కేంద్రం సహాయకులు డా.పి.వి.కె.జగన్నాథం మాట్లాడుతూ రైతులు యాంత్రీకరణ ద్వారా వ్యవసాయం చేయాలన్నారు. కార్యక్రమంలో నైరా శాస్త్రవేత్తలు డి.శ్రీనివాస్, హరికుమార్, నీలవేణి, సమన్వయకర్తలు డాక్టర్ జి.ఎస్.రాయ్, కె.భాగ్యలక్ష్మి, టెక్కలి ఏడీ బి.వి. తిరుమలరావు, కోటబొమ్మాళి ఏఓ గోవిందరావు, జిల్లా సలహామండలి చైర్మన్ డాక్టర్ శిమ్మ నేతాజీ, సర్పంచ్ తలగాన గణపతిరావు, ఎంపీటీసీ సింగూరు కల్యాణి పాల్గొన్నారు.